పక్కదారి పడుతున్న పేదల బియ్యం

- పొన్నూరులో ఊపందుకున్న రేషన్ అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు


పట్టుబడిన రేషన్ బియ్యం పరిశీలిస్తున్న సీఐ వీరానాయక్(ఫైల్)

పొన్నూరు: పొన్నూరు, చేబ్రోలు మండలాల పరిధిలో రేషన్ బియ్యం పక్కదారి పడుతుంది. రేషన్ దుకాణాల ద్వారానే బియ్యం పంపిణీ చేసిన ప్రారంభ నెలలోనే అక్రమ రవాణా ఊపందుకుంది. పేదలకు అందించాల్సిన బియ్యం అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారుల ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు. రేషన్ దుకాణాలపై పూర్తిస్థాయిలో మండల పౌర సరఫరా అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో పట్టణ, మండలాల పరిధిలోని ప్రధాన ప్రాంతాల్లోనే బియ్యం నిల్వ చేసి తరలించేందుకు రేషన్ మాఫియా సిద్ధమైంది. ఆటోల్లో తరలిస్తూ సిరులు ఆర్జిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అప్పుడప్పుడూ నామమాత్రంగా దాడులు నిర్వహించి అరకొర స్వాధీనం చేసుకుని మమ అనిపిస్తున్నారు. దీంతో పొన్నూరు, చేబ్రోలు మండలాల పరిధిలో రోజురోజుకు రేషన్ బియ్యం అక్రమ రవాణా పేట్రేగిపోతోంది.

నాలుగు రోజుల్లో మూడు కేసులు..

కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారానే లబ్ధిదారులకు రేషన్, సరుకులు పంపిణీ చేయమంది. దీంతో అక్రమార్కులకు మార్గం సుగమమైంది. ప్రతి నెలా 1 నుంచి 15 వరకు పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. అయితే పంపిణీ పూర్తవుతున్న చివరి నాలుగు రోజుల్లోనే టన్నుల కొద్దీ బియ్యం పట్టుబడటం గమనార్హం. అక్రమార్కులు సేకరించిన బియ్యంను రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం అధికారుల దాడుల్లో పట్టుబడుతోంది.

కేసులు పెట్టినా మారని తీరు..

చౌక దుకాణ బియ్యం అక్రమంగా తరలిస్తూ పలుమార్లు పట్టుబడిన వ్యక్తులపై కేసులు నమోదయ్యాయి. అయినా యథావిధిగా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇటీవల పట్టణంలోని 29వ వార్డులో 71 బస్తాల చౌక దుకాణ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని మాచవరంలో రూరల్ పోలీసుల దాడుల్లో క్వింటాల బియ్యం.. చేబ్రోలు మండలంలో ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడినా రూటు మార్చి ఏమార్చుతూ దందా సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాలు తిరిగి సేకరణ..

రేషన్ మాఫియా లబ్ధిదారులకు కిలో బియ్యానికి రూ.10 నుంచి రూ.15 వరకు చెల్లించి నిల్వ చేస్తున్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉల్లిగడ్డలు, పాత వస్తువులు కొనుగోలు చేస్తామనే ముసుగులో లగేజీ ఆటోలతో పర్యటించి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని ఒకచోట నిల్వచేసుకొని పెద్దమొత్తంలో లారీలకు లోడు చేసి తరలిస్తుండటం గమనార్హం. లబ్ధిదారుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసిన బియ్యాన్ని అధికారులకు అనుమానం రాకుండా తెల్లసంచుల్లో నింపుతూ భారీ వాహనాల్లో ఇతర ప్రాంతాల్లోని చుండూరు, వట్టిచెరుకూరు మండలాల్లోని కొన్ని మిల్లులకు తరలిస్తు అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

బాలలతో పని చేయించడం చట్టరీత్యా నేరం



పొన్నూరు: 14 ఏళ్ల లోపు పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని.. బడి ఈడు పిల్లలను తప్పక పాఠశాలలకు పంపించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని తహసీల్దారు మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. కార్మిక శాఖ, చైల్డ్ రైట్స్ అడ్వకసీ సంయుక్తంగా నిర్వహిస్తున్న బాల కార్మిక వ్యతిరేక మాసంలో భాగంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో పిల్లలను పని చేయించకూడదు.. చదివించాలనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పొన్నూరు సహాయ కార్మిక అధికారి కె.అనిత, మంగళగిరి సహాయ కార్మిక అధికారి సీహెచ్. మూర్తి, క్రాఫ్ సభ్యులు డి.అక్కయ్య, చైల్డ్ హెల్ప్‌లైన్ సరిత తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు ఏవోగా వెంకటేశ్వరరావు



పొన్నూరు: మండల వ్యవసాయాధికారిగా ఆర్.వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొల్లూరు మండలం నుంచి ఆయన బదిలీపై పొన్నూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు రైతులకు అందే విధంగా పనిచేస్తానని.. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన దేగల వెంకట్రామయ్య బాపట్ల రిసోర్స్ సెంటర్‌కు బదిలీపై వెళ్లారు. అమర్తలూరు నుంచి ఏఈవో శ్రీకాంత్ పొన్నూరుకు వచ్చారు.

అనధికార మద్యం విక్రయాలపై నిఘా

పొన్నూరు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాల పక్కనే ఏర్పాటు చేసిన శీతల పానీయాల దుకాణాలలో మద్యం తాగితే దుకాణ నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ రమేష్ పేర్కొన్నారు. సోమవారం ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యాలయం పరిధిలో మద్యం నూతన విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి అనధికారికంగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్న 43 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 99 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బహిరంగంగా మద్యం తాగుతున్న 12 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయించే వారిపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పెదకాకాని మండల ఏవోగా రమణకుమార్

పెదకాకాని: నూతన మండల వ్యవసాయ అధికారిగా ఖడ్గం రమణకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా మార్టూరు మండల ఏవోగా పని చేస్తున్న రమణకుమార్ బదిలీపై పెదకాకాని వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించాలని ఎంఈవో సీహెచ్ రమాదేవి అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలోని వివిధ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న 27 మంది ఉపాధ్యాయులు మండలం నుంచి బదిలీ కాగా, వారి స్థానంలో ఆయా మండలాల నుంచి 31 మంది ఉపాధ్యాయులు మండలానికి వచ్చారు. వీరు సోమవారం స్థానిక మండల విద్యావనరుల కార్యాలయంలో ఎంఈవో రమాదేవిని కలిసి జాయినింగ్ ఆర్డర్లు అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన బోధన సాగించాలని, గ్రామస్తుల మన్ననలు పొందాలని నూతనంగా విధుల్లో చేరిన ఉద్యోగులకు ఆమె వివరించారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

తెనాలిరూరల్: చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. పొన్నూరుకు చెందిన సంకాల సుకన్య 2021 ఆగస్టు 26న బాపట్ల జిల్లా కొల్లూరులో జరిగిన తన తమ్ముడి గృహప్రవేశానికి హాజరైంది. రాత్రికి కొత్త ఇంటిలోనే అందరూ నిద్రపోయారు. మర్నాడు ఉదయం లేచి చూడగా సుకన్యకు చెందిన సుమారు రూ. 7.40 లక్షల విలువైన ఆభరణాలు ఉన్న బ్యాగు కనబడకుండా పోయింది. దీనిపై ఆమె కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ ఉజ్వల్ కుమార్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నిందితుడు కొల్లిపర మండలం హనుమాన్‌పాలెం గ్రామానికి చెందిన మర్రి వెంకయ్యగా గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు సోమవారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ బి. రాజశేఖర్ నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ప్రజా సంక్షేమం కోసం పాటుపడే వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు పనిచేసే వారే నిజమైన కార్యకర్తలని పార్టీ పొన్నూరు నియోజకవర్గం సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని మామిళ్లపల్లి గ్రామస్థాయి పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలంతా ఐక్యంగా ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు చింతలపూడి మురళీకృష్ణ, మాజీ సర్పంచ్ లంకపోతు పిచ్చిరెడ్డి, సూరిశెట్టి శివయ్య, మీరావలి, పటాన్ భాష, చెట్టుపల్లి కృష్ణ, కర్లపూడి శ్యాము, తోమాటి నాగేశ్వరరావు, ఈగ నాగేశ్వరరావు, కూరాకుల సాంబయ్య, ఇక్కుర్తి చలపతిరావు, పోలూరి పూర్ణచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

సహాయ కార్మిక అధికారిగా అనిత



పొన్నూరు: పొన్నూరు సహాయ కార్మిక అధికారిగా కె.అనిత బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన వి.సాయిజ్యోతి చీరాలకు బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో గుంటూరు కార్మిక శాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అనిత బదిలీపై పొన్నూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బడికి వెళ్లే పిల్లలతో పనులు చేయిస్తే దుకాణ యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

అర్జీలకు సత్వరమే పరిష్కారం

పొన్నూరు: మండల ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 7 అర్జీలను స్వీకరించారు. వాటిలో రెవిన్యూ 2, సర్వే 3, పంచాయతీ రాజ్‌కు సంబంధించి 2 అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, సర్వేయర్ సత్యనారాయణ, ఎంఏఓ ఆర్.వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్


శ్రీనివాసరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బలసాని

ప్రత్తిపాడు: పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దివంగత బాపతు శ్రీనివాసరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా సోమవారం ప్రత్తిపాడులో నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శ్రీనివాసరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నంటి నిలిచిన వ్యక్తి శ్రీనివాసరెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా హనుమంత్ యాదవ్, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు బాపతు వెంకటరమణ, పార్టీ నాయకులు జి.పరమారెడ్డి, గోవింద్ రెడ్డి, వై.సుబ్బారెడ్డి, బి.బ్రహ్మానందరెడ్డి, పెద్దబ్బాయ్, కవిత, సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం కొండేపాడు ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీపై వేరే పాఠశాలలకు వెళుతున్న హెచ్ఎం జి.చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయుడు కె.శ్రీనివాసరావులకు గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక పాఠశాలలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో సోమవారం గ్రామ పెద్దలు, సంఘస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్య


కార్యక్రమంలో ఎంఈవో రాయల సుబ్బారావు, ప్రత్యేక ఉపాధ్యాయులు

చేబ్రోలు: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు(దివ్యాంగులు) భవిత కేంద్రంలో ఉత్తమ సేవలు అందుతున్నాయని.. వీటిని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలు భవిత కేంద్రంలో సోమవారం ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు, తల్లిదండ్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ.. భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్య, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, మొదలగు సేవలను క్రమం తప్పకుండా చిన్నారులకు ఉపయోగించాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఉపకరణములను కూడా అందించనున్నామని తెలిపారు. చిన్నారులకు వీల్ చైర్స్, రోలేటర్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు జి.అనూరాధ, జి.రాజేష్ చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

ప్రత్తిపాడు: అన్నదాత సుఖీభవ పథకానికి లబ్ధి పొందాలంటే రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణ బేగం అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న అన్నదాత సుఖీభవ ఈకేవైసీ నమోదు ప్రక్రియను సోమవారం ఏఈవో పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయనుందని.. చిన్న, సన్నకారు రైతులంతా ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఉన్న వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈకేవైసీ పూర్తి చేసుకోకుంటే సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు.

• వ్యర్థాలకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు!



పొన్నూరు మండలం మునిపల్లె గ్రామ పంచాయతీలో చెత్త సంపద కేంద్రం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రూ.లక్షలు వెచ్చించి చెత్త సంపద కేంద్రం ఏర్పాటు చేసినా పూర్తి స్థాయిలో వినియోగానికి నోచుకోవడం లేదు. గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డు ఆవరణలో డంప్ చేసి నిప్పు పెడుతున్నారు. దీంతో పొగ వ్యాపించి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనచోదకుల నుంచి వ్యతిరేకత వస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా చెత్తకు నిప్పు పెట్టడంతో సంపద సృష్టి కేంద్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రాలను ఉపయోగించాలని.. పొగ కాలుష్యం నుంచి స్థానికుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

– పొన్నూరు

చేబ్రోలు డిప్యూటీ ఎంపీడీవోగా రవిశంకర్



చేబ్రోలు: చేబ్రోలు మండల డిప్యూటీ ఎంపీడీవోగా మాకినేని రవిశంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన ఉషారాణి చుండూరు మండలానికి బదిలీ అయ్యారు. నిజాంపట్నం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న రవిశంకర్‌ను చేబ్రోలు మండలానికి బదిలీ చేయటంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రవిశంకర్‌కు వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

విజ్ఞాన్ విద్యార్థి ఈశ్వర్‌కు పీహెచ్‌డీ


ఈశ్వర్‌ను అభినందిస్తున్న విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీ విద్యార్థి పగడాల ఈశ్వర్‌కు తమ యూనివర్శిటీ సోమవారం పీహెచ్‌డీ పట్టా అందజేసినట్లు వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ తెలిపారు. 'ఎక్స్‌ప్లోరేషన్ అయాన్–డ్రివెన్ కోఆర్డినేషన్ ఫీచర్స్ ఆఫ్ స్కిఫ్స్ బేస్ లింగాడ్స్ డిరైవ్డ్ ఫ్రమ్ హెటిరోస్పైకిల్స్, అప్లికేషన్స్ టువర్డ్స్ ఆర్‌వోపీ అండ్ మెటల్ అయాన్ సెన్సార్స్' అనే అంశంపై విద్యార్థి పరిశోధన చేశారని తెలిపారు. పీహెచ్‌డీ పట్టా పొందిన పగడాల ఈశ్వర్‌ను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వివిధ విభాగాల డీన్లు, తదితరులు అభినందించారు.

అర్హులకు అందని తల్లికి వందనం

పెదకాకాని: పెదకాకాని రేషన్ కార్డుల జారీలో సాంకేతిక సమస్యల వల్ల ప్రభుత్వం గొప్పగా చెప్పుకొనే తల్లికి వందనం పథకం ఎంతోమంది విద్యార్థులకు అందలేదని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. గుంటూరులో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ నాగలక్ష్మికి బాధిత కుటుంబాలతో కలిసి తమ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో చాలామంది నిరుపేదలు జీవిస్తున్నా రేషన్ కార్డు లేని కారణంగా తల్లికి వందనం పథకానికి దూరమవుతున్నారన్నారు. కార్యక్రమంలో రాజా రమేష్, వి.మల్లేశ్వరి, ఎ.నాగేశ్వరరావు, డి.నాగలక్ష్మి, కె.చిన్న రాఘవయ్య, బి.భూలక్ష్మి, డి.దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ భాగస్వాములు కావాలి

తెనాలి డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: టీబీ రహిత దేశంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈ.అన్నపూర్ణ పిలుపునిచ్చారు. టీబీ ముక్తభారత్ అభియాన్ ఇంటెన్సీఫైడ్ క్యాంపెయిన్‌లో భాగంగా పాత ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం వాటికి సంబంధించిన పోస్టర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వచ్చే మూడు నెలల్లో క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు ప్రకటించారు. అలాగే క్షయ వ్యాధి బారినపడిన వారితో పాటు వారి కుటుంబ సభ్యులకు స్క్రీనింగ్ టెస్టులు చేయనున్నట్లు చెప్పారు. టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.రమాదేవి మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు షుగర్, పొగ తాగే వారికి ఆల్కాహాలు సేవించే వారికి గత ఐదు సంవత్సరాల్లో క్షయ వ్యాధి మందులు వాడిన వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్షయ వ్యాధిపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా వైద్యశాల ఆర్ఎంవో డాక్టర్ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ఆధునాతన టీబీ పరీక్షలు చేసే పరికరాలు వైద్యశాలలో ఉన్నాయన్నారు. అవసరమైన వారు వాటిని ఉపయోగించుకోవాలన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రక్షిత్, డాక్టర్ హనోకులు మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు జన్ భగీరథి కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. వృద్ధాశ్రమాలు, నైట్ షల్టర్లు, వసతి గృహాల్లో ఉన్న వారికి క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్, లక్ష్మి, దిలీప్, భార్గవి, హెచ్‌వీలు వెంకటేశ్వరమ్మ, విజయకుమారి, పుష్పలత పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్


డాక్టరేట్ పొందిన వీరాంజనేయులు

గుంటూరు రూరల్: ప్రతి అధ్యాపకుడు, విద్యార్థి లక్ష్య సాధనకు తమ కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మట్లాడారు. తమ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ గోపు వీరాంజనేయులుకు విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. ఆయన 'పెర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ ఆఫ్ కంట్రోల్‌స్ట్రాటజీస్ ఫర్ మైక్రోగ్రిడ్' అనే అంశంపై విశ్వవిద్యాలయంకు చెందిన డాక్టర్ నాగరాజు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె.చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

అంకిత భావంతో నిర్వహించే విధులకు గుర్తింపు


గ్రంథాలయాధికారి సన్మాన కార్యక్రమం

పెదకాకాని: ఉద్యోగ విధులను అంకిత భావంతో నిర్వర్తించిన వారికి సమాజంలో తప్పక ఉత్తమ ఉద్యోగిగా గుర్తింపు లభిస్తుందని గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి అన్నారు. పెదకాకాని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిగా 6 ఏళ్లు విధులు నిర్వహించిన వేమలు విజయ్‌కుమార్ బదిలీపై వెళుతున్న సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ.. గ్రంథాలయానికి విజయ్‌కుమార్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విజయ్‌కుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు. అలానే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.నాగిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు బండ్లమూడి మహిపాల్, లింగంగుంట సాల్మన్‌రాజు, ప్రొఫెసర్ బండ్లమూడి శ్యాంసుందర్, అంబేడ్కర్ రిస్టులు గోళ్ల శ్యామ్ ముఖర్జీ, కంతేటి యలమంద, మధిర శేషయ్య, పాస్టర్ సహాదేవ్, లింగంగుంట రవిబాబు, ఎంపీపీఎస్ హెచ్ఎం కొల్లిపర ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

ఎంపీహెచ్ఈఓ సాంబశివరావు

నిజాంపట్నం: వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ఎంపీహెచ్ఈఓ సాంబశివరావు చెప్పారు. కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం గరువుపాలెంలో అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ వర్షాలు పడటం వల్ల కొత్త నీరు భూమిలోకి చేరి కలుషితం అవడం వల్ల అవి తాగితే నీళ్ల విరేచనాలు అయ్యే ప్రమాదం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం వల్ల పలు రకాల వ్యాధులను దూరం చేసుకోవచ్చన్నారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే అతిసార నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. గ్రామంలోని ఏఎన్ఎంలు, ఆశాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయని, అతిసార బారిన పడితే వాటిని తీసుకుని ఒక లీటర్ నీటిలో ఓఆర్ఎస్ ప్యాకెట్ కలుపుకుని తాగాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎం ఉషారాణి, ఆశ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య

తెనాలిరూరల్: ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేటు ఉద్యోగి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. పట్టణ చినరావూరుకు చెందిన యడ్ల నాగవెంకట మల్లేశ్వరరావు (46) బీఎస్ఎన్ఎల్‌లో ప్రైవేటు ఉద్యోగి. ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం వైకుంఠపురం నుంచి చినరావూరు స్టేషన్ల మధ్య పట్టాలపై అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.